# గలగలా గోదారి

వంశీ



మహోదరుడని వుండేవాడులే. పేరుకే గాదు, ఆకారం లోనూ, వ్యవహారంలోనూ కూడా మహోదరుడేరా. ఆరడుగుల మనిషి, అరవై అంగుళాల ఛాతీ, అందుకు తగ్గట్టుగా వున్న ఉదర వైశాల్యం, జబ్బలు మొదలైన వాటితో బహు శోభాయమానంగా వుండేవాడు. వ్రత మైనా, వన భోజనమైనా మహోదరుడు లేకపోతే వెలితి గానే వుండేదిరా. రాములవారి కళ్యాణమైనా, రాత్రి పూట గస్తీ తిరగాలన్నా మహోదరుడు వుండాల్సిందే. గోదావరి గట్టు మీద తారాజువ్వల పోటీ అయినా, గోదాలోకి దిగి మల్లయుద్ధం చెయ్యాలన్నా మహో దరుడు లేకపోతే పరమ నాసిగా వుండేదిరా.

అటువంటివాడురా మహోదరుడంటే. మహో దరుడి అసలు పేరేమిటో ఎవరికీ గుర్తులేదురా అబ్బాయ్. అతగాడు కూడా "మహోదరా" అని పౌరుష నామంతోటే పలికేవాడురా.

"ఏవోయ్ మహోదరా! ఏవిటి విశేషాలు" అని పెద్దలెవరైనా పలకరిస్తే, "చిత్తం ఏవున్నాయండి" అనే వాడు. "ఏవిటోయ్ మహోదరా! సార్థక నామధేయా!" అని సమవయస్కులు, చనువున్నవాళ్ళు పలకరిస్తే, "ఉత్తుత్తి పలకరింపేనా, ఉదర శాంతేమన్నా చేయి స్తావా" అనేవాడు. "మమ్మల్నిలా విడిచిపెట్టవయ్యా బాబూ. సంసారం గలవాళ్ళం" అనేవారు వాళ్ళు. ఫెళ్ళున నవ్వేసి వెళ్ళిపోయేవాడు. "ఒరేయ్ మహోదరుడుగ్రాోయ్" అని పిల్లలు దూరంగా నిలబడి అరిచేవారు.

"హారి గాడిదల్లారా! వుండండ్రా మీ పని చెబు తాను" అని నవ్వుతూ వాళ్ళ వెంటపడేవాడు. వాళ్ళు పరిగేత్తేవారు. వేగంగా పరిగెడుతున్నట్టు నటిస్తూ వాళ్ళని తరిమేవాడు. వాళ్ళూ తూనీగల్లా పరిగెత్తేవారు. అలా కొంతసేపు వాళ్ళని ఆటపట్టించి, ఆపైన రెండం గలు వేసి ఓ యిద్దర్ని దొరకబుచ్చుకుని చెరో భుజంమీద ఎక్కించుకుని "పదండ్రా రామావతారంగారి కాఫీ హోటల్లో మాంఛి మినప గారెలు తిందాం" అనేవాడు.

"బాబోయ్ మమ్మల్నొదిలేయండి. మాకు గార్లొద్దు" అని ఆ పిల్లలు గింజుకుంటుంటే, ఓ పది గజాల దూరం నడిచి వాళ్ళని మెల్లిగా కింధకి దించేవాడు. దిగడమే తడవుగా, వెనక్కి చూడకుండా వాళ్ళు పరు గందుకునేవారు. రోడ్డు మధ్యలో నిలబడి విరగబడి నవ్వేవాడు. అదొక దైనందిన కృత్యం. చూసేవాళ్ళకి కూడా ఆనందకరంగా వుండేది.

తెల్లవారగట్ల నాలుగ్గంటలకి ప్రారంభమయ్యేదిరా మహోదరుడి దినచర్య. లేచి బద్ధకంగా ఒళ్ళు విరుచు కుని, నోట్లో పందుంపుల్ల పెట్టుకుని గోదావరి గట్టున తుమ్మతోపుల్లోకి పోయి అవసరం తీర్చుకుని ఆ గట్టమ్మటే నడుచుకుంటూ వలంద్రేవుకొచ్చేవాడు. అక్కడున్న గుడి మంటపంలో చెమటతో తన శరీరపు నీడ పడేటంతవరకు దండేలు, బస్కీలు తీసేవాడు. ఆ పైన గోదావర్లోకి దిగి, ఈ ఒడ్డు నుంచి ఆ ఒడ్డు వరకు — ఆ ఒడ్డు నించి ఈ ఒడ్డు వరకు ఒక గంటసేపు రకరకాలుగా ఈదేవాడు. మహోదరుడి ఈత చూ

## మహోదరుడు

సాలు చూడవలసిందేరా అబ్బాయ్. ఒకసారి గోదావరిని అడ్డంగా ఏలుస్తున్నాడా అన్నట్టు మహా ఉధృతంగా వుండేది. మరోసారి పెద్ద సొరచేపలా బుడుంగున మునుగుతూ, తేల్తూ ఈదేవాడు.

అలా, గోదావరి కన్నబిడ్డలా, ఆ తల్లి అలల పయ్యెద చాటున అలుపొచ్చేటంతవరకు ఆడుకునేవాడు. ఆ తరు వాత ఆంజనేయస్వామి గుడికొచ్చి సింధూరం బొట్టు పెట్టుకుని, ఒక అరగంటసేపు కళ్ళు మూసుకుని ఎవరికీ తెలియని ధ్యానం చేసేవాడు. ఆ పైన పూజారి ఇచ్చిన కొబ్బరి ముక్కలో, వడపప్పో నోట్లో వేసుకుని వూళ్ళో కొచ్చేవాడు. ఏ బ్రాహ్మణ సమారాధనకో, నందికేశుడి నోముకో, ఏదైనా వ్రత వుద్యాపనకో, తద్దినానికో - ఏదో ఒక ఆహ్వానం సిద్ధంగా వుండేది. ఆ విధంగా ఆపూట గడిచిపోయేది. ఇంటికొచ్చి అరుగుమీద భుక్తాయాసం తీర్చుకునేవాడు. సాయంత్రం రామావ తారంగారి కాఫీ హోటల్‌కి వెళ్ళేవాడు. ఆయన, ఆప్యా యంగా ఆహ్వానిస్తూ, "రావోయ్ మహోదరా! ఈ రోజు పెసరట్టు మహా భేషుగ్గా కుదిరింది" అంటూ దగ్గరుండి తినిపించేవాడు.

అలా పెసరట్లో, ఇడ్లీలో, వడలో, ఆవడలో నాలు గయిదు పుంజీలు తిని బ్రేవుమని త్రేన్చి, చీకటిపడే వరకు ఆయనతో పిచ్చాపాటీ, మల్లయుద్ధాల గురించి, వంటల గురించి, రుచుల గురించి మాట్లాడి ఇంటి కొచ్చేవాడు. ఇల్లాలు పెట్టినటువంటి ఆవకాయ గడ్డ పెరుగుతో సుష్టుగా భోంచేసి తలుపేసుకోమని చెప్పి వూరంతా చుట్టి వచ్చేవాడు. వచ్చి అరుగు మీదకి శరీరాన్ని చేర్చి నిద్రాదేవిని ఆహ్వానించేవాడు. అదిరా అబ్బాయ్ మహోదరుడి దినచర్య.

"అయితే ఏవిటంటా విశేషం" అంటావా. మహా పసందుగా వుందిరా ప్రశ్న.

విశేషాలకు వూళ్ళేలక్కర్లేదురా. విశేషమంటే వులిపి కట్టెలా వుండడమూ కాదు. ఒకళ్ళకి అపకారం చెయ్య కుండా, వీలైతే చేతనైన సాయం చేస్తూ బతకడం విశేషం కాదురా. గడ్డి పువ్వు పూస్తుంది. "ఏవిటి విశేషం" అంటే, ఏం చెప్పమంటావు చెప్పు. ఈ సృష్టిలో దేని విశేషం దానిదే. అందుకని మహోదరుడి పుట్టుకలో విశేషం మహోదరుడే. ఉండాలన్నా మహోదరుడిలా వుండగలవాళ్ళెంతమంది!

మహోదరుడికి ఒక పనంటూ లేదు. ప్రకృతి సిద్ధంగా వచ్చిన తన శక్తితో నలుగురికి సాయపడడమే అతనికున్నపని.

పెద్దలు మిగిల్చిపోయిన పైరు పొలం కొంత వుంది. దానిమీద వచ్చే అయివేజుతో కుటుంబం గడిచిపోతుంది. అతగాడి తిండికి ఏ లోటు లేదు. ఆనందంగా పోషించ డానికి వూరింది. ఇప్పుడంటే పిడికెడు బియ్యం కూడా వెయ్యడానికి మొహాలుచూసుకునే రోజులాయె. అప్పటి కాలంలో తాము తినడం కన్నా అవతలివాడికి పెట్టడం లోనే ఆనందాన్ని పొందేవారు.


ఓసారి, ఏవయిందనుకున్నావ్. ప్లీడరుగారి పెద్దమ్మాయి నందికేశుడి నోము నోచుకుంది. ఆ రోజు చిమ్మిరి నోము. ఇంటి నిండా కావలసినంత బలగం. "ఎంత సేపులే నోము చెల్లడం" అనుకున్నారు. చుట్టు పక్కల వాళ్ళని పిలిచారనుకో. సంజెవేళ కమ్ముకొచ్చే స్తోంది. చీకటిపడితే నోము చెల్లదు. సూరీడు పడమటి దిక్కులో మునిగిపోకుండా నోము చెల్లాలి. ఇంకా మానెడు నవ్వులతో చేసిన చిమ్మిలి మిగిలిపోయింది. అందరూ అతలాకుతలం అవుతున్నారు. ఆ సమ యంలో మహోదరుడు గుర్తుకొచ్చాడురా. "హన్నా ఎంతపని జరిగింది" అనుకున్నారు. కుర్రకారు ఆఘ మేఘాల మీద రెండు లఘువుల్లో మహోదరుణ్ణి పట్టు కున్నారు.

వచ్చిన మహోదరుడు, "అయ్యో చెప్పారు కాదే మండి. ఈ రోజు కాస్త ఒంట్లో నలతగా వుంది. విరో చనాలట్టుకున్నాయి. చూడబోతే, నందికేశుడి నోమాయె. కాదంటే, ఆడపిల్ల బాధపడుతుంది. ప్రయ త్నిస్తాను" అని బాసీపట్టు వేసుక్కూర్చున్నాడురా.

ప్లీడరుగారితో ఆ మాటా, ఈ మాటా మాట్లాడుతూ, అరగంటలో ఆ చిమ్మిలి కాస్తా ఆరగించేసాడు. అంత వరకు వుగ్గబట్టుక్కూర్చున్నట్టున్న సూరీడు 'హమ్మయ్య' అని సంధ్యాదేవి ఒడిలో వాలిపోయాడురా. అది చాలదురా విశేషానికి.

పోన్లే, మరో విషయం. చైనులు గారని వుండే వారులే. పౌరోహిత్యం చేసుకునేవారు. సత్తెకాలప్మనిషి, పొట్ట కుట్టుకుని ఒక్కగానొక్క కొడుకుని, వాడేదో వుద్ధరిస్తాడని చదివించారు. వాడు కాస్తా చదివినంత చదివి, ఆ పైన చెన్నపట్నంలో వుద్యోగం సంపాదించి, అక్కడే ఓ అరవపిల్లని పెళ్ళి చేసుకుని స్థిరపడిపోయాడు. తిరిగి చూడలేదు. ఉత్తరాలు కూడా వెనక్కే తిరిగొచ్చే సాయి. వృద్ధాప్యంలో దిక్కులేని వారయ్యారు చైనులు గారు. చేతిలో దమ్మిడీ లేదు. చూసే దిక్కు లేదు. ఆ బెంగతో ఆయన కాస్తా 'హరీ' మన్నారు. 'చేతిలో కవకం వుంటే కడగొట్టువాడి శవం కూడా ఖణే రావం టుంది''ట. ఆయన దగ్గర ఆ కవకం లేదు. అందువల్ల ఆ శవం సాయంత్రం వరకు కదల్లేదు. ఆ వీధిలో సొయ్యి రాజుకోలేదు. సలహా చెప్పేవాడే కాని, సాయం పట్టే వాడు లేదు.

అదిగోరా! అప్పుడొచ్చాడు మహోదరుడు పొరుగూ రెళ్ళి. కళ్ళలో చిమ్మిన నీటి బుగ్గని చెంపలమీద ఆణేసుకుని, ఆ శవాన్ని భుజం మీద వేసుకున్నాడు. ఓంకారాన్ని గుక్కపట్టి శ్మశానం జేరి, ఆ అనాథ




ప్రేతానికి అగ్ని సంస్కారం చేసి, గోదావర్లో మునకేసి ఇంటి ముఖం పట్టాడు. చాలా అబ్బాయ్, ఈ విశేషం.

మరోటి విను. గోదావరికి వరదొచ్చి, నాలుగురోడ్లు తప్పించి, వూరు వూరంతా మునకేసినప్పుడు, పడవల్తో పోటీపడుతూ పట్టుకిద్దరి చొప్పున పట్టుకొచ్చి, వూరి మధ్యలో దించాడురా. గోదావరి ఆ వూళ్ళో పది రోజులు కొలువు తీరిందిరా. అంతవరకూ నిద్ర అన్నది ఎరగడురా. తిన్నాడో లేదో కూడా తెలియదురా. మోసిన బస్తాలు మోస్తూనే వున్నాడు. వార్చిన బియ్యం వారుస్తూనే వున్నాడు. మారిన పచ్చళ్ళు మారుతూనే వున్నాడు. వూరు వూరంతా తానే అయి తిరిగాడు. అంతటి అఖండ గౌతమికి అడ్డుకట్టలా నిలబడ్డాడు. అంతా సద్దుమణిగాక, ''మహోదరుడిగారి రుణం ఎట్టాగూ తీర్చుకోలేం. ఆయనకి దణ్ణమన్నా పెడదాం'' అని అనుకున్న జనానికి అయిపు లేకుండా పోయాడు. అవసరానికి అడ్డంపడి పని చెయ్యడమే తెలుసు కానీ, ఆ తరవాతేం జెయ్యాలో తెలియదురా అతగాడికి.

అలా అబ్బాయ్, ఏం చెప్పమంటావ్ విశేషాలు. అతగాడేనాడూ ఏ పనీ చెయ్యలేదు. ''ఏదన్నా పని చేసి నాలుగు డబ్బులు వెనకెయ్యండి'' అని ఆ యిల్లాలు అడగనూ లేదు. అతగాడ్ని సోమరిపోతులా ఆ వూరె వ్వడూ గణించనూ లేదు. కడుపులో పెట్టుకుని కాచు కుంది. ఎన్నో అనాథ ప్రేతాలు అతనికి జోహారులర్పిం చాయి. ఆ వూరికి గోవర్ధనగిరిలా వుండేవాడురా. మనిషికి మనిషి సాయం ఎక్కడ అవసరమైతే అక్కడ మహోదరుడుండేవాడురా.

అటువంటి మహోదరుడు, తానెవరిచేతా చేయించు కోకూడదనుకున్నాడేమో! కొందరికి చెయ్యడమే కాని, చేయించుకోవడం తెలియదురా. ఓ చక్కటి ఏకాదశి ఉదయం గోదావరిలో దిగి ఈత కొడుతూ, ఆ తల్లి పొత్తిళ్ళలో ఆడుకుంటూ పాడుకుంటూ అజా పజా లేకుండా వెళ్ళిపోయాడురా అబ్బాయ్!

